క్లుప్తంగా

సకాలంలో పింఛన్లు అందించండి

మండపేట: వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఇబ్బంది పడకుండా, వారికి సకాలంలో పింఛన్ల పంపిణీకి తగు చర్యలు తీసుకోవాలని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు చాపల వీరబాబు, పెందుర్తి ప్రదీప్‌కుమార్, మోరంపూడి సుబ్రహ్మణ్యం అధికారులను కోరారు. ఈ మేరకు వారు మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందించారు.

డంపింగ్ యార్డులా కళాశాల ఆవరణ


కళాశాల ఆవరణలో వ్యర్థాలను అన్‌లోడ్ చేస్తున్న ట్రాక్టర్

మండపేట: మారేడుబాకలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణ డంపింగ్ యార్డును తలపిస్తోంది. కళాశాల ఆవరణ స్థలాన్ని కొందరు ఇష్టానుసారంగా వాడుకుంటున్నారనే విమర్శలు వస్తున్నాయి. మారేడుబాక, ఆ పరిసర గ్రామాల్లోని కొందరు వ్యక్తులు భవన నిర్మాణ వ్యర్థాలను తెచ్చి కళాశాల ఆవరణలో జార విడుస్తున్నారు. సోమవారం కూడా కొందరు వ్యక్తులు ట్రాక్టర్లపై భవన నిర్మాణ వ్యర్థాలను తెచ్చి ఇక్కడ డంపింగ్ చేయడం మీడియా కంట పడ్డాయి. కాగా వ్యర్థాలను ఇక్కడ డంపింగ్ చేయడం వల్ల తరగతి గదుల్లోకి దుర్వాసన వస్తోందని, తాము భరించలేక పోతున్నామని డిగ్రీ విద్యార్థులు వాపోతున్నారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు తక్షణం స్పందించి అక్కడ డంప్ చేసిన వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చోరీ చేసిన బైక్ స్వాధీనం

కపిలేశ్వరపురం: మండలంలోని అంగర పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన సుజుకి యాక్సిస్ మోటార్ సైకిల్‌ను పోలీసులు నిందితుల వద్ద నుంచి సోమవారం స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం ఎస్సై అందే పరదేశి తెలిపిన కథనం ప్రకారం... అంగరకు చెందిన మోటిపల్లి సురేంద్ర, కోరుమిల్లికి చెందిన సుంకర నరేష్‌లు మోటార్ సైకిల్‌ను దొంగిలించారు. వారి నుంచి మోటారు సైకిల్‌ను స్వాధీనపరుచుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులను ఆలమూరు కోర్టుకు తరలించగా ఈనెల 12 వరకూ రిమాండ్ విధించినట్టు ఎస్సై పరదేశి తెలిపారు.

ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు


మాచవరం వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ టీమ్

రాయవరం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా మండలంలోని మాచవరం వంతెన వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టాయి. తహసీల్‌దార్ ఆర్‌వీ కృష్ణారావు, డ్రైనేజ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో తనిఖీలు జరిపారు. ఈ తనిఖీల్లో భాగంగా పలువురు వాహనదారులకు అవగాహన కల్పించారు. ప్రయాణికులు రూ.50 వేల కు మించి ప్రయాణంలో నగదును తీసుకుని వెళ్లరాదని తహసీల్దార్ కృష్ణారావు సూచించారు.

నేడు లొల్లలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

రాయవరం: విశ్వమానవత సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని లొల్ల గ్రామంలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆ సంస్థ వ్యవస్థాపక చైర్మన్ అల్లూరి శ్రీనివాసచౌదరి మంగళవారం విలేకరులకు తెలిపారు. కపిలేశ్వరపురం ఎల్‌వీ ప్రసాద నేత్ర వైద్య సంస్థ వైద్యులు పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించే వైద్య శిబిరంలో శస్త్ర చికిత్సలు, కళ్లజోళ్లు అవసరమైన వారికి అవసరమైన వైద్య సహాయాన్ని అందజేస్తామన్నారు. శిబిరానికి వచ్చే వారు ఆధార్ కార్డును తీసుకుని రావాలన్నారు.

ఉన్నత విద్యతో ఉన్నతోద్యోగాలు

కొత్తపేట: ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా ఉన్నతోద్యోగాలు పొందాలని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పెద్దిరాజు ఉద్బోధించారు. మంగళవారం స్థానిక డిగ్రీ కళాశాలలో 2023–24లో ఫైనల్ ఈయర్ చదువుతున్న విద్యార్థులకు ఏపీపీజీ సీఈటీ పరీక్షపై అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల జేకేసీ విభాగం తరపున ఈ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దిరాజు అధ్యక్షతన జరిగిన సదస్సులో పలువురు అధ్యాపకులు విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ రాజు మాట్లాడుతూ విద్యార్థులందరూ విధిగా ఉన్నత విద్యను అభ్యసించాలని సూచించారు. దానికి సంబంధించి తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.రమాదేవి, జేకేసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.శ్రీనివాసులు, అధ్యాపకులు డాక్టర్ కె.అంకమరావు, డాక్టర్ కేఎస్ఎన్, డాక్టర్ డీసీహెచ్ పాపారావు, సీహెచ్ నాగరాణి, సీహెచ్ జయశ్రీ, పి.ప్రసన్నజ్యోతి, కె.కనకరాజు, డి.కావ్య, కేఎస్ వల్లీ తదితరులు పాల్గొన్నారు.

మృత్యుకుహరాలు ముంచేస్తాయి

- పిల్లల ఈత సరదా తల్లిదండ్రులకు కడుపుకోత
- సెలవుల్లో జాగ్రత్తలు అవసరం
- ఆకతాయి పనులతో ఆయువు తీసుకోవద్దు


వెదురుమూడి కోరంగి కెనాల్‌లో ఈతకొడుతున్న చిన్నారులు (ఫైల్)

కపిలేశ్వరపురం: పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు ముగిశాయి. సుమారు రెండు నెలల పాటు విద్యాలయాలకు దూరంగా ఉంటారు. సమయం చాలా విలువైనది. ఖాళీగా ఉన్న బుర్ర దెయ్యాల కోట అనే సామెత ఉండనే ఉంది. వృథా సంగతి ఎలా ఉన్నా కొందరు విద్యార్థులు ఆకతాయి పనులకు పాల్పడి ఆయువు తీసుకునే ప్రమాద బాట పట్టిన ఘటనలూ ఉన్నాయి. నది, కాలువల్లో స్నానాలకు దిగి చావును కొని తెచ్చుకోవడమూ తరచూ జరుగుతుంది. బైక్‌లను వేగంగా నడుపుతూ ప్రాణాల మీదకు తెచ్చుకోవడం చూస్తుంటాం. విద్యా సంవత్సరం విరామ సమయాన్ని విజ్ఞాన సముపార్జనకో మానవ సంబంధాలను మెరుగుపరుచుకోవడానికో వినియోగించుకునే ఆలోచనను విద్యార్థులు, యువకులు చేయాలి. సెలవుల నేపథ్యంలో జీవన గమనంపై ఈ కథనం...

దుర్ఘటనల అనుభవాలెన్నో...

2023 మే 21న ఆలమూరు మండలం జొన్నాడ వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగిన అయినవల్లి మండలం పెద్దిపాలెంనకు చెందిన ఇంటర్ విద్యార్థి మోటూరి త్రిలోక్ (17), కొత్తపేట సాయిబాబా మందిర సమీప నివాసితుడైన నర్సరీ కూలి గెద్దం కరుణకుమార్ (22) మృతి చెందారు. వారి స్నేహితుడు కపిలేశ్వరపురం మండలం కోరుమిల్లికి చెందిన అయినవిల్లి భవానీ శంకర్ పుట్టినరోజును జరుపుకున్న తర్వాత వారు నదిలో స్నానానికి వెళ్లారు. 2023 ఏప్రిల్ 14న కె.గంగవరం మండలం కూళ్ల వద్ద గోదావరి నదిలో స్నానానికి దిగిన స్నేహితులు పామర్రుకు చెందిన కొప్పిశెట్టి ఆసాయిరామ్ (24), మట్టపర్తి ఆనంద్ (32), కరప మండలం వేళంగికి చెందిన పితాని రాజేంద్ర (25) నదిలో కొట్టుకుపోయి మృతి చెందారు. సాయిరామ్ పుట్టినరోజు సందడి అనంతరం వారు స్నానానికి దిగారు. 2021 జనవరి 27న కపిలేశ్వరపురానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి శ్రీసజన్ గోదావరిలో స్నానానికి దిగి చనిపోయాడు. 2020 సెప్టెంబర్ 9న కేదారిలంక వద్ద గోదావరి నదిలో జారిపడి కొత్తపేటకు చెందిన వలంటీర్ చోడపనీడి శ్రీవెంకటదుర్గ సాయిలక్ష్మణ్ చనిపోయాడు. ఇలాంటి ఘటనలకు నిర్దిష్టమైన కారణాలేమైనప్పటికీ వారి జీవితాలు అర్ధాంతరంగా ముగిసిపోయాయి. నీటి ఆవాసాల్లో సరదాగా ఈత కోసం దిగినా, ప్రమాదవశాత్తూ జారిపడినప్పటికీ ప్రాణాలు హరించిపోతున్నాయి. జాగ్రత్త వహించాల్సిన అవసరం ఉంది.

ఇసుక తవ్వకాల గుంతలే..

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల వెంబడి విస్తారమైన గౌతమి గోదావరి నదీతీరముంది. గ్రామాల్లో పెద్ద చెరువులు సైతం ఉన్నాయి. అవన్నీ విహారాన్ని, విశ్రాంతిని కోరుకునే యువకులను విశేషంగా ఆకర్షిస్తాయి. గోదావరి నదిలో ఇసుక తవ్వకాలతో లోతైన గుంతలు ఏర్పడతాయి. ఈత కోసం దిగినవారు ఆ గుంతల్లో మునిగే ప్రమాదం ఉంది. కేదారిలంక పడవ రేవు అత్యంత ప్రమాదకరమైంది. కపిలేశ్వరపురం, తాతపూడి గ్రామాల వెంబడి బ్యాంక్ కెనాల్, గోదావరి నదిలో కొందరు జారిపడి మృతి చెందిన ఘటనలున్నాయి. జిల్లా వ్యాప్తంగా 97 కిలోమీటర్ల మేర సముద్ర తీరం ఉంది. నియోజకవర్గాల యువకులు సముద్ర స్నానాలకు వెళ్తుంటారు. అవన్నీ మృత్యు కుహరాలుగా గమనించాల్సిన అవసరముంది.

సెల్ఫీ కోరికకు కళ్లెం వేయాల్సిందే...

నదిలోకి దిగి సెల్ఫీ తీసుకోవడాన్ని యువకులు ఇష్టపడుతున్నారు. అదే వారి పాలిట యమపాశంగా మారొచ్చు. సెల్ఫీ తీసుకునేందుకంటూ వెనక్కి మళ్లుతూ, ఆదమరుపులో గల్లంతై కేదారిలంక పడవ రేవులో ఒక యువకుడు గతంలో మృతి చెందాడు.

కుటుంబ సభ్యులతో గడపడమే మేలు..

సెలవులను కుటుంబ సభ్యులతో గడపడం మేలు. విద్యా సంవత్సరమంతా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు రెండు నెలల పాటు ఉండే సెలవులను కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, స్నేహితులతో గడపడం ద్వారా మానవ సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవచ్చు. అప్పటికీ మిగిలిన సమయాన్ని గ్రంథాలయాలను సందర్శించడం మరింత ప్రయోజనాన్ని ఇస్తుంది.

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక


ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సమక్షంలో పార్టీలో చేరిన ధర్మగుండం వాసులు


టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరుతున్న వారిని ఆహ్వానిస్తున్న పిల్లి సూర్యప్రకాష్ తదితరులు

మండపేట: వైఎస్సార్‌సీపీ లోకి చేరికల పర్వం కొనసాగుతోంది. పట్టణంలోని 15 వార్డు నుంచి సుమారు 30 మంది యువకులు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. ఆ పార్టీ నాయకుడు మేకా శ్రీనివాస్, ఆ వార్డు కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వారంతా పార్టీలో చేరారు. స్థానిక ధర్మగుండం చెరువు జమ్మిచెట్టు వీధిలోని వీరభద్రుడు, వినాయకుడి ఆలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు వారందరికీ పార్టీ కండువాలు వేసి, సాదరంగా ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మండపేట నియోజకవర్గానికి ఇన్‌చార్జ్‌గా వచ్చినప్పటి నుంచి నియోజకవర్గ ప్రజలకు, వ్యాపారులకు స్వేచ్ఛ వచ్చిందన్నారు. తమ వీధిలో వీరభద్రుడు గుడిని చేర్చి ఆలయం ద్వారా అన్నదాన కార్యక్రమాల నిర్వహణకు షెడ్డు ఏర్పాటుకు తోట తన వంతు సహకారం అందించారని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో తాడి రాము, గవర సత్తి బాబు, రాపర్తి శ్రీను , గొర్రెల లక్ష్మి, ఏడాకుల మంగ రాజు, గున్న గణపతి, అడపా నారాయణబాబు, మాకా గోపి, రామాని శ్యామ్ కుమార్, రామాని వెంకన్న తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుల జిన్నూరి సత్యసాయిబాబా, యాండ్ర ప్రభాకరరావు, సితిని సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏడిద నుంచి నలుగురు..

మండపేట మండలం ఏడిద గ్రామానికి చెందిన నలుగురు వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక విజయలక్ష్మి నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆ నలుగురికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించినట్టు మార్కెట్ కమిటీ డైరెక్టర్ పలివెల సుధాకర్ తెలిపారు. పార్టీలో చేరిన వారిలో తమ్మిశెట్టి శ్రీనివాస్, పసలపూడి సూర్యనారాయణ, కొత్తూరు అప్పారావు, ఉడత రమేష్ వున్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక

కె.గంగవరం: మండలంలోని తామరపల్లి, ఊడిమూడి గ్రామాలకు చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం వైఎస్సార్ సీపీలో చేరారు. తామరపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బోడపాటి వీరభద్రరావు, బోడపాటి శ్రీనివాస్‌తో పాటు వారి అనుచరులు, ఊడిమూడి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ యర్రంశెట్టి పుల్లేశ్వరరావుతో పాటు వారి వర్గానికి చెందిన సుమారు 50 మంది వైఎస్సార్ సీపీ రామచంద్రపురం కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ సమక్షంలో పార్టీలో చేరారు. వారిని సూర్యప్రకాష్ పార్టీ కండువా వేసి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానించారు. వారు మాట్లాడుతూ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి మంచి పరిపాలన చేస్తున్నారని పేదలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఆయన పాలనకు ఆకర్షితులమై చేరామన్నారు. వచ్చే ఎన్నికల్లో మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డిని చేసేందుకు కృషి చేస్తామన్నారు. సచివాలయాల కన్వీనర్ తోకల శ్రీను, యువజన నాయకులు జుత్తుక శ్యాం ప్రసాద్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి మెజారిటీకి కృషి చేస్తాం


ద్రాక్షారామలో ఎంపీ బోస్ సమక్షంలో వైఎస్సార్ సీపీకి మద్దతు పలుకుతున్న ద్రాక్షారామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు, నాయకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోనే మేజర్ పంచాయతీ అయిన ద్రాక్షారామలో వైఎస్సార్ సీపీకి సంపూర్ణ మెజారిటీ వచ్చేలా తమ వంతు కృషి చేస్తామని, ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్‌కు మద్దతు పలుకుతున్నామని గ్రామ ఉప సర్పంచ్ పెన్నాడ బుచ్చిరాజు, పంచాయతీ వార్డు సభ్యులు 12 మంది, గ్రామ ఎంపీటీసీ నున్న సత్యవతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలిపారు. గ్రామ పెద్దలు కర్రి వెంకటేశ్వరరావు(అబ్బు), కోటిపల్లి ఆదేశ్వర సూర్యనారాయణ(అబ్బు)ల ఆధ్వర్యంలో మంగళవారం కర్రి అబ్బు నివాసం వద్ద రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్ర బోస్ వారందరికీ పార్టీ కండువాలు వేసి ఉత్సాహపరిచారు. అనంతరం పార్టీ నాయకులతో కలసి ఎంపీ బోస్ గ్రామ పెద్దలు, పలు కులాల పెద్దలను కలసి మద్దతు కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా బాబీ, మాజీ ఉప సర్పంచ్ పోలిశెట్టి తాతబ్బాయి, అడివి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ధాన్యం కొనుగోళ్లు


కపిలేశ్వరపురంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రాజరాజేశ్వరి

కపిలేశ్వరపురం: ప్రస్తుత రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా నిర్వహించనున్నట్టు తహసీల్దార్ రాజరాజేశ్వరి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ధాన్యం దిగుబడి, కొనుగోళ్లకు సంబంధించిన సాంకేతిక అంశాలను వ్యవసాయాధికారి కేవీఎన్ రమేష్‌కుమార్ వివరించారు. తహసీల్దార్ రాజరాజేశ్వరి మాట్లాడుతూ కొనుగోలు ప్రక్రియలో రైసుమిల్లు కస్టోడియన్లుగా వ్యవహరించనున్న వీఆర్వోలు, వ్యవసాయ సహకార సంఘాల సీఈఓ, సచివాలయ వ్యవసాయ సహాయకులు, ఇతర సాంకేతిక ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ఏఓ రమేష్‌కుమార్ మాట్లాడుతూ వరి విస్తీర్ణం ఆధారంగా రైతు భరోసా కేంద్రాలకు గోనె సంచులను సమకూర్చామన్నారు. ఈ క్రాప్ నందు నమోదు చేసుకున్న రైతులంతా తమ ధాన్యాన్ని రైతు భరోసా కేంద్రాలు ద్వారా విక్రయించుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరకంటే బయట మార్కెట్‌లో మరింత ఎక్కువ ధర వస్తే విక్రయించుకునే అవకాశం రైతుకు ప్రభుత్వం కల్పించిందన్నారు. కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేలా సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీఓ ఎ.కొండలరావు ఆదేశించారు.

ఉచిత కోచింగ్ సద్వినియోగం చేసుకోవాలి

కొత్తపేట: పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు పాలిటెక్నిక్, ఏపీఆర్‌జేసీ ఎంట్రన్స్ ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు గుత్తుల వీరబ్రహ్మం సూచించారు. పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు బీసీ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పాలిటెక్నిక్, ఏపీఆర్జేసీ ఎంట్రన్స్ ఉచిత కోచింగ్ తరగతులను స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం నుంచి ప్రారంభించారు. జిల్లా కార్యదర్శి ఆదివారపుపేట వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ నెల 25న ఏపీఆర్జేసీ, 27న పాలిటెక్నిక్ ఎంట్రన్స్ ఎగ్జామ్స్ జరగనున్నాయన్నారు. ఈ నెల 25 వరకూ ఉచిత కోచింగ్ తరగతులు నిర్వహిస్తామన్నారు. తొలిరోజు 45 మంది విద్యార్థులు హాజరు కాగా భౌతిక, గణితం, రసాయన శాస్త్రాలను బోధించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి ఆర్‌వీకేడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని గెలిపిద్దాం


కూళ్లలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి సూర్యప్రకాష్

కె.గంగవరం: పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమం అందాలంటే మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని, టీడీపీ వస్తే ప్రజలను దోచుకుతినేందుకు జన్మభూమి కమిటీలు వస్తాయని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాష్ అన్నారు. మండలంలోని పామర్రు, కూళ్ల గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కులం, మతం పార్టీ భేదాల్లేకుండా టీడీపీ, జనసేన పార్టీల వారికి కూడా సంక్షేమాన్ని అందించిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. టీడీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా పేదలు ఏ లబ్ధి కావాలన్నా జన్మభూమి కమిటీలకు ముడుపులు చెల్లించుకోవాల్సి వచ్చేదని, కానీ జగనన్న ప్రభుత్వం ఏర్పాడిన తరువాత ఈ 58 నెలల్లో అర్హులైతే చాలు సంక్షేమం ఇంటి గుమ్మంలోకే వచ్చేలా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారంజక పాలన అందిస్తున్నారని తెలిపారు. సంక్షేమ ప్రభుత్వం కావాలో, జన్మభూమి కమిటీలు కావాలో ప్రజలకు ఇప్పటికే ఆలోచించి సిద్ధంగా ఉన్నారని అన్నారు. కాబట్టి ప్రజలంతా తమ విలువైన ఓటును ఎమ్మెల్యే అభ్యర్థిగా నాకు, ఎంపీ అభ్యర్థిగా రాపాక వరప్రసాద్‌కు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి ఓటేయాలని కోరారు. ఆయన ఇంటింటికి తిరిగి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కరపత్రాలు పంపిణీ చేశారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్‌లు వాసంశెట్టి వెంకటదుర్గ, చిల్లే నాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, నాయకులు సాదే కపిల్, చిట్టూరి చిన్ని, యువజన నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్, సచివాలయాల మండల కన్వీనర్ తోకల శ్రీను, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు మేలు చేసేది వైఎస్సార్ సీపీ మాత్రమే

- ఎంపీ బోస్


ద్రాక్షారామ మండాలమ్మపేటలో పెద్దలతో మాట్లాడుతున్న ఎంపీ బోస్

రామచంద్రపురం రూరల్: కుల, మతాలు, పార్టీల భేదం చూడకుండా అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ మాత్రమేనని రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ అన్నారు. మండలంలోని ద్రాక్షారామలో మంగళవారం పార్టీ శ్రేణులతో కలసి ఆయన కర్రి వారి వీధి, ముస్లిం కాలనీ, శభాష్‌పేట, ద్రాక్షారామ మార్కెట్, బెస్తవారిపేట, బియ్యంపేట, మండాలమ్మపేటల్లో పర్యటించి పెద్దలను కలసి వైఎస్సార్ సీపీకి మద్దతు ఇవ్వాల్సిందిగా కోరారు. రానున్న ఎన్నికల్లో ఎంపీగా రాపాక వరప్రసాద్, ఎమ్మెల్యేగా తన కుమారుడు పిల్లి సూర్యప్రకాష్‌లను ఆశీర్వదించి గెలిపించాలని అభ్యర్థించారు.

జనసేన నుంచి వైఎస్సార్ సీపీలో చేరిక..

మండాలమ్మపేటలో జనసేన నాయకుడు, మాజీ ఎంపీటీసీ యలమంచిలి రాజు వైఎస్సార్ సీపీలో చేరగా, ఎంపీ బోస్ ఆయనకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీ శాకా బాబీ, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, మండల కోఆప్షన్ సభ్యుడు షేక్ అహ్మద్ అలీషా, వక్ఫ్ బోర్డు కార్యదర్శి జాఫర్, నాయకులు నరాల ఏడుకొండలు, కర్రి అబ్బు, అడివి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సప్త కలశారాధన

మామిడికుదురు: పెదపట్నంలంక దేవి సెంటర్‌లో కొలువుదీరిన కోదండరామస్వామి వారి పాల శిలా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా రెండో రోజు మంగళవారం పలు ప్రత్యేక పూజలు జరిగాయి. ముత్యాల వీవీ లక్ష్మీసత్యనారాయణ–శ్రీదేవి, ముత్యాల అమ్మిరాజు–కుమారి, ముత్యాల దుర్గాప్రసాద్–ఉషాదేవి దంపతులు ప్రధాన కర్తలుగా పాల్గొని పూజలు చేశారు. వేద మంత్రోచ్చారణల నడుమ వేద పండితులు పలు పూజలు, అభిషేకాలు నిర్వహించారు. బుధవారం ఉదయం 7.15 గంటలకు శ్రీహనుమత్ సీతారామ లక్ష్మణ సమేత కోదండ రామచంద్రస్వామి ప్రతిష్ఠ జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది.

చంద్రబాబు కుటిల రాజకీయంతో పేదలకు అవస్థ


నక్కా సింహాచలం

కపిలేశ్వరపురం: పేద, మధ్య తరగతి అవ్వాతాతలకు నెలనెలా ఇస్తున్న పింఛన్ల కార్యక్రమాన్ని రాజకీయం చేస్తూ ఆటంకాలు కల్పించడం ద్వారా టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన రాజకీయానికి పేద, మధ్య తరగతి ప్రజలు అవస్థలు పడుతున్నారని ఏఎంసీ చైర్మన్, దళిత నాయకుడు నక్కా సింహాచలం విమర్శించారు. ఈ మేరకు మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో చంద్రబాబు తీరును ఖండించారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారు జామునే ప్రభుత్వ పింఛను డబ్బులు అందుతాయని ఆశగా చూస్తున్న నిరుపేద పింఛను లబ్ధిదారులకు కష్టాలు కల్పిస్తూ చంద్రబాబు తన కుట్రను చాటుకున్నారన్నారు. పింఛను పంపిణీలో వలంటీర్ల సేవలను వినియోగించుకోవడంపై ఫిర్యాదు చేసి వారి ఆసరాపై దెబ్బకొట్టిన చరిత్ర చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వలంటీర్లు పింఛన్లు పంపిణీ చేయడం ఎన్నికల సమయంలో మాత్రమే కాదని దీర్ఘకాలంగా జరుగుతున్న ప్రక్రియ అన్న సంగతి చంద్రబాబుకు తెలియదా అని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో ప్రభుత్వ సేవలకు ఆటంకం కల్పిస్తే ప్రజలు తగిన బుద్ధి చెబుతారన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలి


తర్లపూడి ఆరోగ్య సురక్షలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది నాయకులు

కాజులూరు: రాష్ట్రంలో ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.సౌజన్య అన్నారు. మంగళవారం మండలంలోని తర్లంపూడిలో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ నరాల బాలరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన స్త్రీ, ప్రసూతి వైద్య నిపుణులు పాల్గొని 312 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు.

ఐక్యతతో పనిచేద్దాం


పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో పాల్గొన్న నాయకులు

రామచంద్రపురం: నియోజకవర్గంలో పాస్టర్స్ ఫెలోషిప్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కలసికట్టుగా ఉంటూ ఐక్యతతో పనిచేద్దామని రాష్ట్ర పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షుడు ఆర్‌పీ జాషువా అధ్యక్షతన పట్టణంలోని అక్షయ రెస్టారెంట్‌లో మంగళవారం నియోజకవర్గ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ రాష్ట్ర సెక్రటరీ, జిల్లా అధ్యక్షుడు డేనియేల్ పాల్ హాజరయ్యారు. సమావేశంలో పలు నిర్ణయాలను ఆమోదిస్తూ తీర్మానం చేశారు. నియోజకవర్గంలోని పట్టణంతో పాటుగా మూడు మండలాల్లోను క్రైస్తవులు, పాస్టర్స్ ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కలసికట్టుగా పోరాటం చేసేందుకు ఒక ప్రత్యేకమైన ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. జిల్లా అడ్వైజర్ వి.జాన్ బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

అతిగా మందులు వాడితే అనర్థమే

కాజులూరు: పంటలపై సోకే తెగుళ్లు, పురుగుల ఉధ్ధృతిని బట్టే రైతులు ఎరువులు, పురుగుమందులు వినియోగించాలని అవసరాన్ని మించి మందులు వాడకం అనర్థాలకు దారితీస్తుందని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. మంగళవారం మండలంలోని చేదువాడ, తర్లంపూడి, టి.మామిడాడ తదితర గ్రామాల్లో వ్యవసాయాధికారులు పర్యటించి రైతులకు పలు సూచనలు అందించారు. చేదువాడలో ఏఓ మాట్లాడుతూ పంటలపై రైతులు అవసరానికి మించి మందులు వాడుతున్నారని రెండు, మూడు రకాల మందులను కలిపి వాడుతుండటంతో ఏ మందు పనిచేయక వృథా వ్యయాలు అవుతున్నాయన్నారు. ఫలితంగా ఖర్చు పెరిగి రైతులు నికర ఆదాయం తగ్గుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నరాల బాలరాజు, మాజీ సర్పంచ్ వై.పోతురాజు, పలువురు స్థానిక రైతులు పాల్గొన్నారు.